క్రీడా జ్యోతికి స్వాగతం

కామారెడ్డి క్రీడావిభాగం, న్యూస్‌టుడే: సీఎం కప్ క్రీడాజ్యోతికి కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ కామారెడ్డి బైపాస్ రోడ్డులో శనివారం స్వాగతం పలికారు. కలెక్టర్ మాట్లాడుతూ.. క్రీడాకారులను ప్రోత్సహించడానికి సీఎం కప్ 2024 టార్చ్ రిలే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ఈ క్రీడా జ్యోతి జిల్లాలో 48 కి.మీ కొనసాగుతుందని పేర్కొన్నారు. అనంతరం క్రీడాకారులు, యువకులు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ క్యాడెట్లతో కలిసి బైపాస్ రోడ్డు నుంచి బస్టాండ్ వరకు 10 కిమీ పరుగును జెండా ఊపి ప్రారంభించారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో రంగనాథ్ రావు, డీవైఎస్‌వో జగన్నాథన్, మున్సిపల్ కమిషనర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.



పరుగును ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

ధ్రువపత్రాల పరిశీలన పూర్తి

కామారెడ్డి విద్యావిభాగం-న్యూస్‌టుడే: జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులకు 1:3 నిష్పత్తిలో నిర్వహించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన శనివారంతో ముగిసింది. మొత్తం 1157 మంది అభ్యర్థులకు సంబంధించి నిజ ధ్రువీకరణ పత్రాలను అధికారులు పరిశీలించారు. చివరి రోజు 254 మంది విద్యాశాఖ కార్యాలయానికి వచ్చారు. జిల్లాలో 506 పోస్టులకుగాను 1249 మంది అర్హత సాధించారు. 92.63 శాతం మంది అభ్యర్థుల పత్రాలను అధికారులు పరిశీలించారు. 10 బృందాలు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యాయి. ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకు పరిశీలన కార్యక్రమం కొనసాగింది. ఎంపికైనవారి జాబితా త్వరలో వెల్లడికానుంది.

వరద బాధితుల సహాయార్థం విరాళాలు

కామారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: వరద బాధితుల సహాయార్థమై జిల్లా నిరుద్యోగ కళాకారులు సేకరించిన విరాళాలు రూ.23,850లను ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ చేతుల మీదుగా రాష్ట్ర సంఘానికి శనివారం పంపించారు. నిరుద్యోగ కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సొంటెం సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఏ పదవి దక్కునో..!

ఆశగా ఎదురుచూస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఈనాడు, కామారెడ్డి

త్వరలోనే నియామక పదవుల భర్తీ (నామినేటెడ్ పోస్టులు) ఉంటుందనే సమాచారంతో అధికార కాంగ్రెస్ పార్టీలో సందడి నెలకొంది. మొదటి విడతలో మాజీ మంత్రి షబ్బీర్ అలీని ప్రభుత్వ సలహాదారుగా నియమించారు. బాన్సువాడ నియోజకవర్గ సీనియర్ నేత కాసుల బాల్‌రాజ్‌కు కార్పొరేషన్ ఛైర్మన్ పదవి వరించింది. పలువురు నేతలు రాష్ట్రస్థాయి లేదంటే జిల్లాస్థాయి పదవి ఇవ్వాలని ముఖ్యనేతలను కలిసి అభ్యర్థిస్తున్నారు. రాష్ట్రస్థాయి కార్పొరేషన్ల డైరెక్టర్ పదవులతో పాటు జిల్లాస్థాయి పదవులను భర్తీ చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కసరత్తు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో రెండో విడతలో ఎవరెవరికి పదవులు దక్కుతాయనే ఉత్కంఠ నెలకొంది.

స్థానిక సంస్థల టికెట్ కోసం..

ఇప్పటి వరకు ఎల్లారెడ్డి నియోజకవర్గంలో, భిక్కనూరు మార్కెట్ కమిటీని మాత్రమే నియమించారు. కామారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల్లో మార్కెట్ పదవుల కోసం పార్టీనే నమ్ముకుని ఉన్న సీనియర్ నేతలు ఆశగా ఎదురుచూస్తున్నారు. వీటితో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్, డైరెక్టర్ పదవుల భర్తీ కోసం నిరీక్షిస్తున్నారు. సామాజిక సమీకరణాల దృష్ట్యా నియామక పదవులు దక్కకుంటే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ టికెట్ కేటాయించి గెలుపు బాధ్యతలను తీసుకోవాలని కోరుతున్నారు. ● లోక్‌సభ ఎన్నికల ముందు భారాస, ఇతర పార్టీల నుంచి పెద్దఎత్తున నేతలు కాంగ్రెస్‌లో చేరారు. ఇందులో కొందరికి నియామక పదవులు ఇస్తామని ఆశచూపి పార్టీలో చేర్చుకున్నారు. ప్రస్తుతం ఆయా నేతలు హామీ గురించి సీనియర్ నేతలను కలుస్తూ గుర్తుచేస్తున్నారు. ● పొరుగునే ఉన్న నిజామాబాద్ జిల్లాలో మొదటి విడతలో నలుగురు నేతలకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు వరించగా.. కామారెడ్డి జిల్లా నుంచి ఒక్కరికే ఇవ్వడంపై సీనియర్ నేతలు లోలోన అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ● జిల్లాకు చెందిన పలువురు ద్వితీయ శ్రేణి నేతలు పదవుల కోసం ఎమ్మెల్యేలతో పాటు మాజీ మంత్రి షబ్బీర్ అలీని కలుస్తూ పదేళ్లుగా పార్టీకోసం పని చేసిన తీరును గుర్తుచేస్తున్నారు.

మంత్రివర్గ విస్తరణ ఉంటుందనే ఊహాగానాలున్నాయి. పీసీసీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్ గౌడ్ బాధ్యతలు చేపట్టడంతో పార్టీ రాష్ట్ర కార్యవర్గంతో పాటు జిల్లాకాంగ్రెస్ కమిటీకి కొత్త అధ్యక్షుడు, కార్యవర్గాన్ని నియమించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కామారెడ్డి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజయం కోసం పనిచేసిన పలువురు ద్వితీయశ్రేణి నేతలు రాష్ట్రస్థాయి పదవులపై ఆశలు పెట్టుకున్నారు. తరచూ ముఖ్యమంత్రిని, ఆయన సోదరుడిని కలిసి పార్టీ కోసం తాము చేసిన సేవలను నివేదిస్తున్నారు.

★ ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేలు ఏఐసీసీ కీలక నేతలను కలుస్తూ మంత్రి పదవుల కోసం ప్రయత్నిస్తున్నారు. మాజీ మంత్రి షబ్బీర్‌అలీ మైనార్టీ కోటాలో మంత్రి పదవి కోసం ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. బాన్సువాడ నియోజకవర్గం నుంచి పోటీచేసి ఓటమి చెందిన ఏనుగు రవీందర్‌రెడ్డి సైతం కార్పొరేషన్ ఛైర్మన్ పదవి కోసం విస్తృత ప్రయత్నాలు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. భాజపాకు రాజీనామా చేసి తిరిగి కాంగ్రెస్ గూటికి చేరిన ఎల్లారెడ్డి నియోజకవర్గానికి చెందిన సీనియర్ నేత వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి సైతం నియామక పదవి కోసం ప్రయత్నిస్తున్నారు.

ఎవరికి వారే ప్రయత్నం...





మహాసభల ప్రారంభోత్సవంలో జెండావిష్కరణ చేస్తున్న అఖిల భారతీయ కిసాన్ సంఘ్ ప్రధాన కార్యదర్శి మోహిని మోహన్‌మిశ్రా (నీలం రంగు చొక్కా ధరించిన వ్యక్తి), నాయకులు : సభకు హాజరైన రైతులు

రైతును బాధపెడితే.. ప్రభుత్వాలు మనుగడ సాగించలేవు

భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర మహాసభల్లో వక్తలు

కామారెడ్డి వ్యవసాయం, న్యూస్‌టుడే: రైతుల పేరుతో రాజకీయాలు చేస్తూ.. కర్షకులను బాధపెడితే ప్రభుత్వాలు మనుగడ సాగించలేవని అఖిల భారతీయ కిసాన్ సంఘ్ ప్రధాన కార్యదర్శి మోహిని మోహన్‌మిశ్రా అన్నారు. కామారెడ్డి జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో శనివారం నిర్వహించిన భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర మహాసభల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. దేశంలో వ్యవసాయ చట్టాల అమలును మార్చాలని భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో రైతులు కోరినా.. పంథా మార్చుకోని ప్రభుత్వాలు అయోధ్యలో బాలరాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠించి రాముడిని నమ్ముకొని 400 సీట్లు గెలుస్తామని లోక్‌సభ ఎన్నికలకు వెళ్లినా. . అది సాధ్యపడలేదన్నారు. ఎందుకంటే రైతులు ఆశీర్వదించకపోవడం వల్లే అలా జరిగిందన్నారు. కిసాన్ సమ్మాన్ నిధిని పెంచిన సమయంలో ఎన్నికల్లో సీట్లు పెరిగిన విషయాన్ని గుర్తుచేశారు. రైతాంగ శ్రేయస్సు కోసం పనిచేసే ప్రభుత్వాలే అధికారంలోకి వస్తాయన్నారు.

సంఘటిత పోరాటాలతోనే ప్రయోజనం

సభలో ఇతర వక్తలు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో చెప్పినట్లుగా రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలన్నారు. రైతులు పండించిన పంటలన్నింటికీ రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. పంటల బీమా పథకాన్ని అమల్లోకి తేవాలన్నారు. బడ్జెట్‌లో రైతు సమస్యల పరిష్కారానికి ఇచ్చే రాయితీ కోసం కేటాయించే నిధులను పెంచడానికి ప్రభుత్వంపై భారతీయ కిసాన్ సంఘ్ ఒత్తిడి చేస్తోందన్నారు. పంటలను అమ్మడానికి వెళ్లినప్పుడు పన్నులు కట్టే పరిస్థితిపై రైతులు సంఘటితంగా పోరాడాలని అన్నారు.

మద్దతు ధర ఇవ్వాలి

రైతులు పండించిన పంట దిగుబడులకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసిన విషయాలను పునః సమీక్షించి ప్రాంతాలు, రాష్ట్రాల వారీగా ప్రతి పంటకు మద్దతు ధరను నిర్ణయించాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు అన్నిరకాలైన విత్తనాలను ఉచితంగా సరఫరా చేయాలన్నారు. రైతుల కోసం నిరంతరాయంగా పోరాడే అతిపెద్ద సంఘంగా భారతీయ కిసాన్ సంఘ్ వెలుగొందుతోందన్నారు.

కదిలివచ్చిన కర్షక లోకం

మహాసభకు కర్షకులు పెద్ద ఎత్తున వచ్చారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు జెండావిష్కరణ చేసి బలరాముడి చిత్రపటం ముందు పూజలు నిర్వహించారు. ఈ సభలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్‌రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యుడు శ్రీధర్‌రెడ్డి, జోనల్ అధ్యక్షుడు లొంక వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి శంకర్‌రావు, ఉపాధ్యక్షుడు రాజేశం భారతీయ కిసాన్ సంఘ్ గ్రామ, మండల, జిల్లా నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి అభివృద్ధికి ప్రత్యేక చొరవ

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే : ఎల్లారెడ్డి అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. నూతనంగా ఎన్నికైన ఎల్లారెడ్డి మున్సిపల్ ఛైర్మన్ పద్మ శ్రీకాంత్, పాలకవర్గ సభ్యులు శనివారం ఎమ్మెల్యేను కలిసి పలు సమస్యలు వివరించారు. దసరా పండగ రోజు అర్హులైన పేద ప్రజలకు డబుల్ బెడ్ రూం ఇళ్లను పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అర్ధాంతరంగా నిలిచిన బస్టాండు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, సమీకృత మార్కెట్ నిరాణానికి నిధులు మంజూరయ్యాయని త్వరలోనే పనులు పూర్తవుతాయన్నారు. వెంట కౌన్సిలర్ నీలకంఠం, నాయకులు శ్రీనివాస్, విద్యాసాగర్, తిరుపతి, పోచయ్య తదితరులు ఉన్నారు.


ఎమ్మెల్యేకు సమస్యలు విన్నవిస్తున్న పాలకవర్గ సభ్యులు

నాలుగు గేట్లు ఎత్తి నీటి విడుదల



నిజాంసాగర్, న్యూస్‌టుడే: నిజాంసాగర్ జలాశయానికి వరద ప్రవాహం పెరగడంతో నాలుగు గేట్లను ఎత్తి నీటిని మంజీరా నదిలోకి విడుదల చేసినట్లు జలవనరు శాఖ ఏఈఈ శివప్రసాద్ తెలిపారు. శనివారం సాయంత్రానికి ప్రాజెక్టులోకి 8,000 క్యూసెక్కుల వరద వచ్చి చేరడంతో 20 వేల క్యూసెక్కుల నీటిని మంజీరాలోకి, రెండు వేల క్యూసెక్కులు నిజాంసాగర్ ప్రధాన కాలువలోకి విడుదల చేసినట్లు చెప్పారు. జలాశయం సామర్థ్యం 1405 అడుగులు (17.802 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1404.98 అడుగులు (17.773 క్యూసెక్కులు) మేర నీరు ఉందన్నారు.

సన్నరకాల కొనుగోలుకు ప్రత్యేక కేంద్రాలు

ధాన్యం సేకరణకు 10 సెక్టార్లుగా విభజన

న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్

జిల్లాలో వానాకాలం వరి కోతలు దసరా తర్వాత ప్రారంభం కానున్నాయి. ముందుగా నాట్లు వేసుకున్న రైతులు కొన్ని చోట్ల కోతలు ఇప్పటికే ప్రారంభించారు. జిల్లాలో 3.15 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా 7.37 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇందులో 6.79 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల విక్రయిస్తారని అధికారులు అంచనాలు రూపొందించారు.


కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను లారీలో ఎక్కిస్తున్న హమాలీలు(పాతచిత్రం)

గుర్తింపునకు యంత్రం

జిల్లాలో సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే 356 కేంద్రాలు ఏర్పాటు చేస్తామని అధికారులు ప్రకటించారు. వానాకాలం సీజన్‌లో 1,98,827 మెట్రిక్‌టన్నుల సన్నధాన్యం వస్తుందని వ్యవసాయాధికారులు పౌరసరఫరాలశాఖకు సమాచారం అందించారు. ఈ మేరకు ఎక్కడెక్కడ అదనంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలో అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న సాధారణ దొడ్డు రకం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు కొంత దూరంలో సన్న రకం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. సన్నరకం ధాన్యాన్ని గుర్తించడానికి ప్రతీ కొనుగోలు కేంద్రానికి ప్రత్యేక యంత్రం(గ్రేన్‌కాలివేర్) తీసుకువస్తున్నారు.

జిల్లాలో వరి సాగు విస్తీర్ణం	:	3,15,657 ఎకరాలు
దొడ్డురకం సాగు	:	2,16,830 ఎకరాలు
సన్నరకం సాగు	:	98,827 ఎకరాలు
దొడ్డు రకం దిగుబడి	:	5,20,392 మెట్రిక్ టన్నులు
ఇందులో రైతులు విక్రయించేది(అంచనా)	:	4,80,943 మె.ట.
సన్న రకం దిగుబడి	:	2,16,979 మె.ట.
రైతులు విక్రయించేది (అంచనా)	:	1,98,823 మె.ట.


1.40 కోట్ల గన్నీ సంచులు అవసరం

సెక్టార్		మండలాలు
1	:	బాన్సువాడ, నస్రుల్లాబాద్
2	:	బిచ్కుంద, బీర్కూర్
3	:	డోంగ్లి, మద్నూర్, పెద్దకొడప్‌గల్
4	:	నిజాంసాగర్, పిట్లం, మహమ్మద్‌నగర్
5	:	నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి
6	:	గాంధారి, సదాశివనగర్
7	:	లింగంపేట, తాడ్వాయి
8	:	కామారెడ్డి, రామారెడ్డి
9	:	భిక్కనూరు, రాజంపేట
10	:	బీబీపేట, దోమకొండ, మాచారెడ్డి, పల్వంచ

ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో ముఖ్యమైనది రవాణా. ఇందుకోసం జిల్లాను పది సెక్టార్లుగా విభజించారు. ఇప్పటికే 9 సెక్టార్లకు టెండర్లు పూర్తయ్యాయి. ప్రతి సెక్టార్‌కు 20 లారీలను గుత్తేదారు అందుబాటులో ఉంచుతారు. ధాన్యం సేకరణకు 1.40 కోట్ల గన్నీ సంచులు అవసరం కాగా.. ప్రస్తుతం 20 లక్షల సంచులు అందుబాటులో ఉన్నాయి. మిగతావి టెండర్ల ద్వారా సమకూర్చుకుంటున్నారు.

'పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు'

భిక్కనూరు, న్యూస్‌టుడే: భిక్కనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం సభ్యులు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణంలో ఇన్‌ఛార్జి సెక్రటరీ నర్సింలు వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్య అతిథిగా ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎంపీ సురేష్ షెట్కార్ హాజరయ్యారు. నూతన కమిటీ ఛైర్మన్‌గా బీబీపేట మండలం జనగామ గ్రామానికి చెందిన పాత రాజు, వైస్ ఛైర్మన్‌గా పెద్దమల్లారెడ్డికి చెందిన స్వామితో పాటు డైరెక్టర్లు, భిక్కనూరు సింగిల్ విండో ఛైర్మన్ ప్రమాణస్వీకారం చేశారు. షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. త్వరలోనే డిజిటల్ కార్డులను తీసుకువచ్చి పారదర్శకంగా ప్రభుత్వ పథకాలను అందిస్తామన్నారు. నియోజకవర్గానికి 3500 నుంచి 4000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. గత పదేళ్లలో కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి రూ.కోట్లు దండుకున్నారని ఆరోపించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని గెలిపించాలని ఎంపీ సురేశ్ షెట్కార్ అన్నారు. రైతుల సంక్షేమం కోసం పనిచేస్తానని నూతన ఏఎంసీ ఛైర్మన్ రాజు అన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, టీపీసీసీ కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, వ్యాపారి తిమ్మయ్యగారి వేణుగోపాల్‌రెడ్డి, డీసీఎంఎస్ వైస్ ఛైర్మన్ ఇంద్రసేనారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, భిక్కనూరు, దోమకొండ, బీబీపేట, రాజంపేట కాంగ్రెస్ మండలాధ్యక్షులు భీంరెడ్డి, అనంతరెడ్డి, సుతారిరమేష్, యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న భిక్కనూరు ఏఎంసీ నూతన పాలకవర్గం సభ్యులు

గునుగు పూల కోసం.. గిరి పల్లెలకు

బతుకమ్మ వేడుకల్లో ఉపయోగించే గునుగు పూలకు పట్టణాల్లో కొరత నెలకొంది. దీంతో బాన్సువాడ, నారాయణఖేడ్, బీర్కూర్, నస్రుల్లాబాద్, కల్హేర్, నిజాంపేట్, బాచేపల్లి, ఎల్లారెడ్డి తదితర ప్రాంతాల నుంచి పలువురు పిట్లం మండలం తండాలు, పెద్ద కొడప్‌గల్ సముందర్ తండా, బురుగుపల్లి, టికారాం తండా, కుబ్యానాయక్ తండా, తలాబ్ తండా తదితర ప్రాంతాలకు వస్తున్నారు. పూలను కోసుకొని ఇలా ద్విచక్ర వాహనాలపై తరలిస్తున్నారు. చిన్నకొడప్‌గల్ సమీపంలో జాతీయ రహదారి మీదుగా వెళ్తుండగా న్యూస్‌టుడే ఈ చిత్రాన్ని క్లిక్‌మనిపించింది. – న్యూస్‌టుడే, పిట్లం



చరవాణుల గుర్తింపులో కామారెడ్డి ప్రథమం

న్యూస్‌టుడే: కామారెడ్డి నేరవిభాగం

పోగొట్టుకున్న చరవాణులు రాబట్టడంలో కామారెడ్డి ముందంజలో ఉంది. బాధితులకు వాటిని అప్పగించడంలో కమిషనరేట్లను మినహాయిస్తే రాష్ట్రంలోనే కామారెడ్డి నంబర్ 1 స్థానంలో నిలిచింది. ఏప్రిల్ 2023 నుంచి సీఈఐఆర్ విధానం అమలులోకి వచ్చింది. అప్పటి నుంచి జిల్లా పోలీసులు ఉత్తమ పనితీరు కనబరుస్తున్నారు.

పోగొట్టుకున్న వెంటనే ...

జిల్లాలో బాన్సువాడలో అత్యధికంగా 347 చరవాణులు గుర్తించి బాధితులకు అందజేశారు. కామారెడ్డి పట్టణంలో 275, దేవునిపల్లి-120, భిక్కనూరు-112, ఎల్లారెడ్డి-111, సదాశివనగర్‌లో 101.. ఇలా జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 2020 చరవాణులు గుర్తించారు. చరవాణి పోతే వెంటనే సిమ్‌కార్డు బ్లాక్ చేయించాలి. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి రసీదు పొందాలి. దీంతో బాధితుడి ఆధార్‌తో పోయిన చరవాణి ఐఎంఈఐ బ్లాక్ చేయొచ్చు. పోయిన చరవాణిలో కొత్త సిమ్‌కార్డు వేసేందుకు ప్రయత్నిస్తే సంబంధిత వివరాలు సీఈఐఆర్ ట్రేస్‌బిలిటీ రిపోర్ట్‌లో వస్తాయి. ఈ ప్రక్రియ ద్వారా పోలీసులు చరవాణిని రికవరీ చేస్తున్నారు.

ప్రత్యేక బృందం ఏర్పాటు - సింధూశర్మ, జిల్లా ఎస్పీ

సీఈఐఆర్ పద్ధతితో చరవాణులను తిరిగి రాబట్టి వాటిని యజమానులకు అప్పగించేందుకు జిల్లాలో ప్రత్యేకం బృందం ఏర్పాటు చేశాం. దీంతో ఉత్తమ ఫలితాలు వచ్చాయి. నెల రోజుల వ్యవధిలోనే 152 చరవాణులను రికవరీ చేశాం. చరవాణి పోతే వెంటనే పోలీసులను ఆశ్రయించాలి.


చరవాణుల రికవరీ మేళాలో పాల్గొన్న ఎస్పీ సింధూశర్మ, ఏఎస్పీ నర్సింహారెడ్డి తదితరులు

రైతు శ్రేయస్సే లక్ష్యం

మద్నూర్, న్యూస్‌టుడే: రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అన్నారు. శనివారం మద్నూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన సోయా కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. క్వింటాకు రూ.4,892 మద్దతు ధర కల్పిస్తున్నట్లు చెప్పారు. ఎకరానికి తొమ్మిది నుంచి పది క్వింటాళ్ల వరకు పంట దిగుబడి వస్తుండగా కేంద్రంలో కేవలం ఆరు క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, ఈ నిబంధనలను సడలించేలా సంబంధిత మంత్రికి విజ్ఞప్తి చేస్తానని హామీనిచ్చారు. వెంట మార్కెట్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాయిలు ఉన్నారు.



ధాన్యం తూకం వేస్తున్న ఎమ్మెల్యే తోట

జ్వరాల వార్డు పరిశీలన

నిజామాబాద్ వైద్యవిభాగం, న్యూస్‌టుడే: ప్రజలకు అందుతున్న ఆరోగ్య సదుపాయాలు పరిశీలించేందుకు జిల్లా ప్రత్యేకాధికారి, వైద్యవిధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ శనివారం ఆకస్మికంగా నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో జ్వరాల వార్డుతో పాటు ఇతర వార్డులు పరిశీలించారు. రోగులతో ప్రత్యేకంగా మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ఓపీ రిజిస్టర్, వైద్యులు, సిబ్బంది హాజరును చూశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆసుపత్రికి అవసరమైన మౌలిక సదుపాయాల గురించి ప్రత్యేకాధికారికి వివరించారు. సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. జిల్లా వైద్యాధికారి రాజశ్రీ, డీసీహెచ్ఎస్ శ్రీనివాస్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రోగితో మాట్లాడుతున్న వైద్యవిధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్

జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపిక



సింధూ

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని సింధూ జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ సునీత తెలిపారు. నారాయణపేటలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థిని బంగారు పతకం సాధించింది. విజేతను .. ప్రిన్సిపల్ సావిత్రి, పీఈటీ గౌరమ్మ, ఉపాధ్యాయులు ప్రమీల, దేవిక, అనురాధ తదితరులు అభినందించారు.

సంప్రదాయ వారధులు

☛ 'బతుకమ్మ'ను భావి తరాలకు తెలుపుతున్న అతివలు

ఆడపడుచుల ఆత్మీయ నేస్తం బతుకమ్మను చిన్నప్పటి నుంచి కొలుస్తూ.. వారసత్వాన్ని భావితరాలకు అందిస్తున్నారు.. పూలతో అమ్మవారిని పేర్చడం.. పసుపుతో గౌరమ్మను పూజించడం.. కుటుంబ బాంధవ్యాలను ప్రతిబింబించే పాటలు పాడుతూ తమ తర్వాతి తరాలకు బతుకమ్మ గొప్పదనాన్ని అందిస్తున్నారు.. కుమార్తెలు, కోడళ్లతో పాటు మనవరాళ్లకు పండగ విశిష్టత తెలియజేస్తూ వారూ ఇందులో భాగస్వాములయ్యేలా చూస్తున్నారు ఈ మహిళలు.
న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం

నాలుగో తరానికి అందిస్తున్నా..

- జిన్న సరస్వతి, కాలూరు, నిజామాబాద్

బతుకమ్మ చేయడం అమ్మ, అమ్మమ్మ నుంచి నేర్చుకున్నా. బొడ్డెమ్మను 15 రోజుల పాటు ఆడేవాళ్లం. బతుకమ్మకు అవసరమైన పూలు కోసుకొచ్చేందుకు ఇప్పటికీ పోటీపడతాం. గ్రామంలో చాలా మందికి బంధుత్వాలు, ప్రేమానురాగాలపై పాటలు నేర్పించా. ఇప్పుడు మా మనవరాళ్లకు సైతం బతుకమ్మ పేర్చడం, ఆటలు ఆడడం, ఊరేగింపులో అమ్మవారిని తలపై మోసేలా చూస్తా. పండగొచ్చిందంటే నాకెంతో సంతోషంగా ఉంటుంది. మా కుటుంబంలో నాలుగో తరం ఈ వేడుకల్లో పాల్గొనేలా చూస్తా.



50 ఏళ్లుగా ఆడుతున్నా

- కరుణ, బోర్గాం(పి), నిజామాబాద్

మాది డొంకేశ్వరం మండల కేంద్రం. మా ఊళ్లో బతుకమ్మ ఘనంగా చేసుకునే వాళ్లం. అమ్మ వారి మహిమలను కీర్తిస్తూ పాటలు పాడడం నాకు చాలా ఇష్టం. 50 ఏళ్లుగా అమ్మవారి సేవలో తరిస్తున్నా. మా కూతుళ్ల కోసం ఇక్కడికి వచ్చా. వారితో పాటు మనవరాలు ప్రణవి అన్నిరకాల పూలు తీసుకొచ్చి వాటికి రంగులు వేసి బతుకమ్మను పూజిస్తుంటే నా చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయి. మనదైన పల్లెసంస్కృతికి ఈ తరం పిల్లలు గౌరవం ఇవ్వడం బాగుంది. ఇది ఇలాగే కొనసాగాలి.



చేతిసంచులతో బతుకమ్మ

- సందగిరి భూదేవి, బోర్గాం(పి), నిజామాబాద్

మాది వ్యవసాయ కుటుంబం. నాకు బతుకమ్మ అంటే ఎంతో ఇష్టం. గతంలో పూలు అడవికి వెళ్లి తెచ్చేవాళ్లం. ఇప్పుడు పూలసేకరణ కష్టమవుతోంది. అందరిలా పూలతో కాకుండా చేతి సంచులతో బతుకమ్మ తయారు చేశా. కూరగాయలు కొన్నప్పుడు ఇచ్చే సంచులను ఇందుకు ఉపయోగించా. మధ్యలో కర్రను ఉంచి చుట్టూ 21 వరసల్లో దారంతో సంచులు కుట్టా. పైన పసుపుగౌరమ్మ ఉంచా. పది రోజుల పాటు కష్టపడి తయారు చేశా. ఇందుకు పైసా ఖర్చు కాలేదు. కాగితపు బతుకమ్మ కంటే ఇది మేలైంది.



క్రీడా స్ఫూర్తి చాటాలి

కామారెడ్డి క్రీడావిభాగం, న్యూస్‌టుడే: క్రీడాకారులు గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడా స్ఫూర్తి చాటాలని కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో శనివారం 69వ తెలంగాణ సబ్ జూనియర్ అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ టోర్నీని ఆమె ప్రారంభించి మాట్లాడారు. తొలి రోజు పూల్-ఏ బాలుర విభాగంలో విజేత నిజామాబాద్, రన్నర్‌గా వరంగల్ జట్లు నిలిచాయి. పూల్-బీలో ఆదిలాబాద్ గెలుపొందగా, రన్నర్‌గా రంగారెడ్డి జట్టు నిలిచింది. బాలికల విభాగంలో పూల్-ఏలో ఖమ్మం జట్టు విజయం సాధించింది. పూల్-బీలో వరంగల్ విజేతగా, నల్గొండ రన్నర్‌గా నిలిచాయి. కార్యక్రమంలో బాల్ బ్యాడ్మింటన్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు లోయపల్లి నర్సింగరావు, తెలంగాణ బాల్‌బ్యాడ్మింటన్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీవీ రమణ, ఉపాధ్యక్షుడు దర్గయ్య, వీరభద్రరావు, రవీంద్రకుమార్, శ్యామ్, తిరుపతి, నారాయణరెడ్డి, బయన్న, కామారెడ్డి జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, రాజేశ్వర్, మహేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ సింధూశర్మ

తప్పుడు ధ్రువపత్రాలు సమర్పిస్తే కేసులు

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో ఎవరైనా తప్పుడు ధ్రువపత్రాలు సమర్పిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని రాష్ట్ర విద్యాశిక్షణ పరిశోధన సంస్థ డైరెక్టర్ గాజర్ల రమేశ్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమాన్ని ఆయన శనివారం పర్యవేక్షించి మాట్లాడారు. ధ్రువపత్రాల పరిశీలన తర్వాత వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని సూచించారు. ప్రక్రియ సజావుగా నిర్వహించిన సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో డీఈవో రాజు, విద్యాశాఖ అధికారులు బలరాం, వేణుగోపాల్, నాగవేందర్, వెంకటరమణారావు, కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న గాజర్ల రమేశ్

ప్రయాణం ఇబ్బందికరం



గుంతలు, మట్టితో కనిపిస్తున్న ఈ చిత్రం గొడుగు మర్రితండా వెళ్లే రహదారి. ఇటీవలి వర్షాలకు మరింత అధ్వానంగా మారింది. గత ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి రూ.90 లక్షలు మంజూరు చేసినా నేటికీ పనులు ప్రారంభం కాలేదు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ అధికారులను వివరణ కోరగా.. పనులు త్వరగా ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.
– న్యూస్‌టుడే, రామారెడ్డి

వాహనాల పార్కింగ్ అస్తవ్యస్తం

చిత్రంలో కనిపిస్తున్న ద్విచక్రవాహనాలు కామారెడ్డి ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలోనివి. బస్టాండ్ ఆవరణలో కాకుండా నేరుగా లోపలే వాహనాలను నిలుపుతున్నారు. దీంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అటు ఆర్టీసీ అధికారులు ఇటు పోలీసు సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరించడంతో నిత్యం పార్కింగ్ చేసే వాహనాల సంఖ్య పెరుగుతోంది. – న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్



విధులకు ఆలస్యంగా వైద్యులు

☛ కలెక్టర్ తనిఖీలో బహిర్గతం

కామారెడ్డి వైద్యవిభాగం, న్యూస్‌టుడే: జిల్లాకేంద్రంలోని బోధనాసుపత్రిలో వైద్యులు సమయపాలన పాటించడం లేదు. కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శనివారం ఉదయం ఆకస్మికంగా ఆసుపత్రికి రాగా వైద్యుల అలసత్వం బట్టబయలైంది. ఉదయం 9 గంటలు దాటాక కలెక్టర్ ఆసుపత్రికి వచ్చారు. 45 నిమిషాల పాటు అక్కడే ఉన్నారు. అప్పటివరకు నలుగురు వైద్యులు మాత్రమే వచ్చారు. దీంతో ఆయన వైద్యుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ రాంసింగ్ కూడా విధులకు రాలేదు. ఈ పరిస్థితిని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో రంగనాథ్‌రావు, తహసీల్దారు జనార్దన్‌ను అక్కడే ఉంచి వెళ్లిపోయారు. 11 గంటల వరకు ఎవరు ఎప్పుడొస్తున్నారనే విషయాన్ని నమోదు చేశారు. ఆలస్యంగా వచ్చినవారికి మెమోలు ఇవ్వాలని ఆదేశించారు. ఆ తర్వాత వైద్యాధికారులను కలెక్టరేట్‌కు పిలిపించుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఆసుపత్రిలో వైద్యుల హాజరును పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



పటాల రూపంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

పంట సాగులో మెలకువలు తప్పనిసరి

సదాశివనగర్ : మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకొని పంటలు పండించినట్లయితే సేద్యం లాభసాటిగా ఉంటుందని ప్రొఫెసర్ ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థినులు పేర్కొన్నారు. ఆర్ఏడబ్ల్యూఈపీ ప్రోగ్రాంలో భాగంగా సదాశివనగర్‌లో పంటల సాగుకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. నియంత్రిత సాగు విధానంతో మేలైన ఫలితాలు వస్తాయన్నారు. అందుబాటులో ఉన్న వనరులు, నేల రకాలు, వాటి స్వభావాన్ని బట్టి పంటలను ఏ విధంగా ఎంచుకోవాలో రైతులకు వ్యవసాయ కాలచక్రం, సామాజిక పటం, సమస్యల చెట్టు తదితర విధానాల ద్వారా వివరించారు. కార్యక్రమంలో మాల్తుమ్మెద ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రేవంత్‌నాథన్, విద్యార్థినులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అధ్యాపక ఖాళీలకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి పట్టణం : జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మూడు అధ్యాపక పోస్టుల భర్తీకి చర్యలు చేపడుతున్నట్లు ఇంటర్ విద్య జిల్లా అధికారి సలాం ఓ ప్రకటనలో వెల్లడించారు. కామారెడ్డిలో హిందీ, ఉర్దూ, బిచ్కుందలో గణితం(ఉర్దూ మాధ్యమం) ఒక్కో పోస్టు చొప్పున ఖాళీ ఉన్నట్లు తెలిపారు. పీజీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు 10వ తేదీలోగా దరఖాస్తులను ఇంటర్ విద్య జిల్లా కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

యువత ప్రపంచానికి ఆదర్శంగా నిలవాలి

నిజాంసాగర్, న్యూస్‌టుడే: మన దేశ యువత ప్రపంచానికి ఆదర్శంగా నిలవాలని మాజీ శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి అన్నారు. నిజాంసాగర్ మండల కేంద్రంలోని నవోదయ విద్యాలయంలో సొంతంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..విద్యార్థులు తల్లిదండ్రులు, గురువులను గౌరవించినప్పుడే దేశభక్తి ఏర్పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ సహాయ గుణం కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ సత్యవతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



నవోదయ విద్యాలయంలో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎల్లారెడ్డి

రెజ్లింగ్‌లో క్రీడాకారుల ప్రతిభ

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: నారాయణపేట్ జిల్లాలోని దన్వాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించడం గర్వంగా ఉందని నిజామాబాద్ ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగమణి తెలిపారు. రెండు రోజుల పాటు జరిగిన పోటీల్లో శనివారం వివిధ విభాగాల్లో పతకాలు సాధించారని పేర్కొన్నారు. శిక్షకుడిగా దేవేందర్, మేనేజర్‌గా సంతోషి వ్యవహరించారు.

విజేతల వివరాలు: **అండర్-17 : బంగారం:** నేహా బేగం, ఎం.సింధు, **వెండి:** కోమలి, **కాంస్యం:** సుజిత, త్రిష, స్నేహప్రియ **అండర్-14 : వెండి:** జయశ్రీ, **కాంస్యం:** కావేరీ, స్రవంతి

దస్త్రాల్లో పేర్లు... కనిపించని ఊళ్లు

న్యూస్‌టుడే,మద్నూర్

ఎక్కడైనా గ్రామం ఉంటేనే ఆ ఊరికి ఏదో ఒక పేరు ఉంటుంది. కానీ మద్నూర్, డోంగ్లీ మండలాల్లో మాత్రం నాలుగు గ్రామాలు లేకున్నా వాటి పేర్లు మాత్రం రెవెన్యూ దస్త్రాల్లో పదిలంగా ఉన్నాయి. కొన్నేళ్ల క్రితం మండలంలో హాజీపూర్, చిమ్నాపూర్, వాడీఫత్తేపూర్, మల్నాపూర్ గ్రామాలు ఉండేవి. అప్పట్లో భారీ వర్షాలు కురిసి కొన్ని గ్రామాలు ముంపునకు గురవడం, మరి కొన్ని ప్రాంతాల్లో రోగాల బారిన పడి ప్రజలు మృతిచెందడంతో భయాందోళన చెందిన స్థానికులు ఊళ్లను ఖాళీ చేసి ఇతర గ్రామాల్లో స్థిరపడ్డారు. కాని ఆ పల్లె పేర్లు మాత్రం ప్రభుత్వ దస్త్రాల్లో (రికార్డుల్లో) నేటికీ ఉన్నాయి. లచ్చన్ గ్రామ సమీపంలోని హాజీపూర్‌కు గుర్తుగా నేటికీ హనుమాన్ మందిరం ఉంది.



హాజీపూర్ : ఇళ్లు నేలమట్టమైన ఆనవాళ్లు



హనుమాన్ మందిరం

పేదరికం చదువుకు అడ్డుకాదు

బీర్కూర్, న్యూస్‌టుడే: పేదరికం చదువుకు అడ్డుకాదని ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీకాంతరావు, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్ పేర్కొన్నారు. ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన నగేష్‌తో పాటు శ్రీకాంత్, నర్మదలను శనివారం వారు బీర్కూర్ వెంకన్న కొండపై సత్కరించారు. నాయకులు రఘు, రాజు, శశికాంత్ పాల్గొన్నారు.

బీర్కూర్: బీర్కూర్ శివారులోని తెలంగాణ తిరుమల దేవస్థానాన్ని బాన్సువాడ, జుక్కల్ ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తోట లక్ష్మీకాంతరావు, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్ దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు వీరికి స్వాగతం పలికారు. అనంతరం భక్తులతో మాట్లాడారు. నాయకులు హన్మంత్‌రావు, నాగేశ్వర్‌రావు, నర్సరాజు తదితరులు ఉన్నారు.




నగేష్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యేలు పోచారం, లక్ష్మీకాంతరావు, కాసుల బాల్‌రాజ్

మేముున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
బాన్సువాడ 83284 29129
కామారెడ్డి 93970 82242



స్పందన: జిల్లాకేంద్రంలోని వాసవీనగర్‌లో మురుగు కాల్వలో చెత్త పేరుకుపోవడంపై స్థానికుడు లింగం 'ఈనాడు' దృష్టికి తేగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్వేజ్ స్పందించి పూడిక తీయించారు.





స్పందన: జిల్లా కేంద్రంలోని డెయిలీ మార్కెట్‌లో దుర్వాసన వస్తోందని, స్థానికుడు రాజు ఈనాడు దృష్టికి తేగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్వేజ్ స్పందించి బ్లీచింగ్ చల్లించారు.



స్పందన: మండలంలోని విఠల్‌వాడీ తండాలో కుళాయి నీరు రహదారిపై చేరి పరిసరాలు బురదమయంగా మారుతున్నాయి. సమస్యను మేముున్నాం.. మీకు తోడుగా దృష్టికి తీసుకురావడంతో స్పందించిన అధికారులు శనివారం ట్రాక్టర్ సహాయంతో తాత్కాలిక కాలువను తవ్వించి నీరు మళ్లించి సమస్య పరిష్కరించారు.

●●● అరగొండ, గుండారం గ్రామాల్లోని పల్లె ప్రకృతి వనాల్లో నిర్వహణ సరిగ్గా లేదు. - రవి, గుండారం, సాయిలు అరగొండ

●●● హాలీల కొరతతో ఇబ్బందులు పడ్తున్నాం. పంచాయతీ సిబ్బందితో పనులు చేయిస్తాం. -రమూరామ్, ఎంపీవో, రాజంపేట

●●● కన్యాపూర్ సెంట్రల్ నర్సరీ ప్రాంతంలో ఆదిలాబాద్ రోడ్డు వర్షాలకు ఇరువైపులా కోతకు గురవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రాజాగౌడ్, గ్రామస్థుడు.

●●● రోడ్డుకు ఇరువైపులా మొరం పోయించి ప్రమాదాలు నివారిస్తాం. రవితేజ, ఏఈ.

●●● మల్లూర్ గ్రామ పంచాయతీ వద్ద వాటర్ ట్యాంకు(ప్లాస్టిక్) పగిలి నీరు వృథాగా పోతోంది. - సాయిలు, మల్లూర్

●●● రెండు రోజుల క్రితం ప్లాస్టిక్ వాటర్ ట్యాంకు పగిలిన విషయం నా దృష్టికి వచ్చింది. దానికి వెల్డింగ్ చేయించి నీటి వృథాను అరికట్టే విధంగా చర్యలు తీసుకుంటాం. -సంతోష్, కార్యదర్శి, మల్లూర్

●●● పిట్లం మండల కేంద్రంలోని బీడీ కార్మికుల కాలనీ వద్ద ప్రధాన రోడ్డుపై నీరు పారి మురుగు కూపంగా మారుతోంది. సుధాకర్, స్థానికుడు

●●● నీరు రోడ్డు మీదకు రాకుండా చర్యలు చేపడతాం. యాదగిరి, పంచాయతీ కార్యదర్శి, పిట్లం.

●●● సంగమేశ్వర కాలనీ 4వ వీధిలో పలు చోట్ల మురుగు కాల్వలు చెత్తతో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. - రాజు, స్థానికుడు



●●● పారిశుద్ధ్య పర్యవేక్షకుడు సతీష్ దృష్టికి తీసుకెళ్లగా సమస్య పరిష్కరింపజేశారు.

●●● ఎస్సీ, రజక కాలనీల్లో మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదు- **శ్రీనివాస్, అంబారిపేట**

●●● పరిశీలించి, చర్యలు చేపడతాం- **నరేందర్, ప్రత్యేకాధికారి, అంబారిపేట**

-న్యూస్‌టుడే, పిట్లం, రామారెడ్డి, నిజాంసాగర్, కామారెడ్డి పట్టణం, రాజంపేట, పెద్దకొడప్‌గల్, బాన్సువాడ పట్టణం, దోమకొండ



నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తదితరులు

వెంకటస్వామికి నివాళి

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి జయంతి నిర్వహించారు. కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ హాజరై ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. డీఆర్‌డీవో సురేందర్, సీపీవో రాజారాం, డీవైఎస్‌వో జగన్నాథన్, జిల్లా సంక్షేమాధికారి బావయ్య, డీపీఆర్వో భీమ్‌కుమార్ ఉన్నారు.

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: కేంద్ర మాజీ మంత్రి వెంకటస్వామి జయంతిని పురపాలక కార్యాలయంలో నిర్వహించారు. ఛైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ పూలమాల వేసి నివాళులు అర్పించారు. వైస్‌ఛైర్‌పర్సన్ వనిత, కమిషనర్ సుజాత, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.



పుర కార్యాలయంలో... ఛైర్‌పర్సన్ ఇందుప్రియ, కమిషనర్ సుజాత తదితరులు



కామారెడ్డి: శ్రీ సాందీపని విద్యాసంస్థల ఆధ్వర్యంలో..



కామారెడ్డి: భూపుత్రమ్మ కల్యాణ మండపం సమీపంలో



దోమకొండ గడీ కోటలో..

పూల పండుగ.. మది నిండుగ

రామరామ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. గౌరమ్మ గౌరమ్మ ఉయ్యాలో అంటూ మహిళలు ఆడిపాడారు. జిల్లావ్యాప్తంగా బతుకమ్మ సంబరాలను శనివారం నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో బతుకమ్మలను పేర్చారు. ప్రధాన ఆలయాలు, కూడళ్ల వద్ద బతుకమ్మలను ఉంచి ఆడారు. అనంతరం నీళ్లలో నిమజ్జనం చేశారు.

- న్యూస్‌టుడే,కామారెడ్డి పట్టణం



కామారెడ్డి: ఐఎంఏ ఆధ్వర్యంలో..



కామారెడ్డి: ఎస్ఆర్‌కే డిగ్రీ కళాశాల విద్యార్థినుల ఆధ్వర్యంలో



భిక్కనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..



అరగొండలో ..



కామారెడ్డి విద్యుత్తుశాఖ కార్యాలయంలో ఉద్యోగులు



గాంధారి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ..



బాన్సువాడ కల్కి చెరువు వద్ద...



సదాశివనగర్ : కుప్రియాల్‌లో



ఎల్లారెడ్డి : శ్రీరామసేన యూత్ మండపం వద్ద



బాన్సువాడ పట్టణం: కోట దుర్గమ్మ ఆలయంలో..



తాడ్వాయిలో ..

అన్నపూర్ణేశ్వరి నమోస్తుతే

అమ్మవారు శనివారం అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అన్నదానం చేశారు. **న్యూస్‌టుడే, బృందం:**



దోమకొండలో



గాంధారి: దుర్గానగర్‌లో సామూహిక కుంకుమార్చనలు



బాన్సువాడలో...



హౌసింగ్ బోర్డు కాలనీలో..



కామారెడ్డి: శారదాంబ అమ్మవారి అలంకరణ



నస్రుల్లాబాద్‌లో అన్నదానం...



రథాన్ని విరాళంగా ఇస్తున్న భారతి ఫౌండేషన్ సభ్యులు

రథం విరాళం

భిక్కనూరు, న్యూస్‌టుడే: భిక్కనూరుకు చెందిన న్యాయవాది లింగాల రాజబాబుగౌడ్ తన తాత శివరాజగౌడ్, నానమ్మ గాలమ్మల జ్ఞాపకార్థం గ్రామ పంచాయతీకి వైకుంఠ రథం విరాళంగా ఇచ్చారు. గ్రామస్థుల సౌకర్యార్థం భారతి ఫౌండేషన్ ద్వారా వైకుంఠ రథాన్ని పంచాయతీ కార్యదర్శి మహేష్ గౌడ్ సమక్షంలో పంచాయతీకి అందించారు.

హుండీ ఆదాయం రూ.6.58 లక్షలు

బీర్కూర్, న్యూస్‌టుడే: తెలంగాణ తిరుమల దేవస్థానంలో శ్రీవారి హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. 3 నెలలుగా భక్తులు సమర్పించిన కానుకలు రూ.6,58,490 వచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యుడు మద్దినేని నాగేశ్వర్‌రావు తెలిపారు. దేవళ్ల హన్మంత్‌రావు, రాజు, కిరణ్ తదితరులు ఉన్నారు.

చెక్కు అందజేత

నర్సింగ్‌రావుపల్లి(నిజాంసాగర్), న్యూస్‌టుడే: భారాస కార్యకర్తలను ఆదుకుంటామని మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే అన్నారు. నిజాంసాగర్ మండలంలోని నర్సింగ్‌రావుపల్లి గ్రామానికి చెందిన పండరి రోడ్డు ప్రమాదంలో మరణించడంతో కుటుంబ సభ్యులకు శనివారం రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేశారు. మాజీ వైస్ ఎంపీపీ మనోహర్, మాజీ సీడీసీ ఛైర్మన్ దుర్గారెడ్డి, నాయకులు రమేష్‌గౌడ్, విఠల్, సాయిలు పాల్గొన్నారు.

ఓటు నమోదుపై అవగాహన

బాన్సువాడ, న్యూస్‌టుడే: పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పట్ట భద్రుల ఓటు నమోదుపై తపస్ సంఘం ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బూనేకర్ సంతోష్, కిష్టయ్య, నర్సయ్య, స్వరూప్ తదితరులున్నారు.

కుక్కల బెడద నివారించరూ...

రామారెడ్డి, న్యూస్‌టుడే: రామారెడ్డి మండల కేంద్రంలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. మహిళలు, చిన్నారులు బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. తరచూ దాడులు చేస్తుండడంతో పలువురు ఆస్పత్రుల పాలవుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి క్రాంతిని న్యూస్‌టుడే వివరణ కోరగా ... కుక్కలను పట్టేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



రామారెడ్డిలో నడిరోడ్డుపై వీధికుక్కలు

డిజిటల్ కుటుంబ సర్వే

బాన్సువాడ గ్రామీణం, న్యూస్‌టుడే: డిజిటల్ కార్డు సర్వేలో భాగంగా పైలెట్ ప్రాజెక్టులో ఎంపికైన నాగారం గ్రామ పంచాయతీని సబ్ కలెక్టర్ కిరణ్మయి శనివారం సందర్శించారు. ఇంటింటికీ తిరుగుతూ సర్వేలో పాల్గొన్నారు. కుటుంబ జాబితాను తయారు చేసి యూనిక్ నెంబర్ కలిగిన డిజిటల్ కుటుంబ కార్డులను మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపీడీవో బషీరుద్దీన్, ఎంపీవో సత్యనారాయణ రెడ్డి తదితరులు ఉన్నారు.

హక్కుల సాధనకు పోరాటం

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: కార్మికుల హక్కుల సాధనకు పోరాటం చేసి అసువులు బాసిన ఆర్టీసీ సిబ్బందికి కామారెడ్డి డిపో ఐకాస ప్రతినిధులు శనివారం నివాళి అర్పించారు. అమరులను స్మరించుకోవాలనే ఉద్దేశంతో కార్యక్రమం చేపట్టినట్లు వెల్లడించారు. అమరుల స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రతినిధులు రమేశ్, ఖదీర్, కృష్ణమూర్తి, వీడీ దాస్, బుచ్చిరెడ్డి, బాలయ్య, సీతారాములు, క్రాంతి తదితరులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

జీవాలు తరలిస్తున్న వాహనం అడ్డగింత

నస్రుల్లాబాద్, న్యూస్‌టుడే: నస్రుల్లాబాద్‌లో శనివారం రాత్రి మూగజీవాలను తరలిస్తున్న వాహనాన్ని భాజపా, బజరంగ్‌దళ్ నాయకులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య ఉద్రిక్తతకు దారితీసింది. నిజామాబాద్ జిల్లా సాటాపూర్ అంగడిలో ఆరు మూగజీవాలను కొనుగోలు చేసి బాన్సువాడకు తరలిస్తుండగా వాహనాన్ని భాజపా, బజరంగ్‌దళ్ నాయకులు అడ్డుకున్నారు. అందులో నుంచి జీవాలను కిందకు దించే క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ, బాన్సువాడ గ్రామీణ సీఐ

ఇరువర్గాల వాగ్వాదం

సత్యనారాయణగౌడ్, బీర్కూర్ ఎస్సై రాజశేఖర్‌తో పాటు కామారెడ్డి నుంచి ఎఆర్ ప్రత్యేక పోలీసు బలగాలు ఘటనా స్థలికి చేరుకున్నారు. ఇరువర్గాలను బలగాలు చెదరగొట్టారు. మూగజీవాలను పోలీసు పహారా మధ్య బిచ్కుంద గోశాలకు తరలించారు. గ్రామంలో ఎలాంటి ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. జీవాలను తరలిస్తున్న బాన్సువాడ వాసి ఖురేషీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌ఛార్జి ఎస్సై వెంకట్‌రావు తెలిపారు.

ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన

దోమకొండ, న్యూస్‌టుడే: దోమకొండలోని టెలిఫోన్ బీడీ కంపెనీలో కామారెడ్డి బోధనాసుపత్రి ఐసీటీసీ కౌన్సిలర్ మేక నాగరాజు శనివారం ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టెలిఫోన్ బీడీ కంపెనీ శైలేష్‌కుమార్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

అడవులను రక్షించాలి

రాజంపేట, న్యూస్‌టుడే: అడవులను కాపాడాల్సిన బాధ్యత అందరిదని ఎఫ్ఆర్వో రమేష్ అన్నారు. శనివారం నడిమి తండా, ఈనామ్ తండాలలో వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహించారు. అడవుల చుట్టూ ఉన్న వ్యవసాయ భూముల్లో రైతులు విద్యుత్తు తీగలను ఏర్పాటు చేయొద్దని చెప్పారు. సెక్షన్ అధికారి బాబా, సిబ్బంది ప్రమీల, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

ఎస్సీ సెల్ ఛైర్మన్‌గా సౌదాగర్ అరవింద్

పెద్దకొడప్‌గల్, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి చెందిన సౌదాగర్ అరవింద్‌ను జుక్కల్ నియోజక వర్గ ఎస్సీ సెల్ ఛైర్మన్‌గా నియమిస్తూ.. ఏఐసీసీ ఎస్సీ సెల్ విభాగం ఛైర్మన్ రాజేష్ తిలోతియా దిల్లీలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతూ.. ఇచ్చిన బాధ్యతను చక్కగా నిర్వర్తిస్తానని తెలిపారు.



పత్రాన్ని అందజేస్తున్న రాజేష్ లిలోతియా

మృతదేహం లభ్యం

నాగిరెడ్డిపేట్, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు పోచారం ప్రధాన కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన తాండూరు గ్రామంలో చోటుచేసుకుందని ఏఎస్సై ఉమేశ్‌కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన పల్లే పద్మారావు (47) గత నెల 27 నుంచి కనిపించడం లేదని స్థానిక ఠాణాలో భార్య నీలమ్మ ఫిర్యాదు చేసింది. శనివారం ఉదయం తాండూరు గ్రామంలోని పోచారం ప్రధాన కాల్వ వంతెన వద్ద మృతుని చెప్పులు కనిపించడంతో బంధువులు, స్థానిక జాలరుల సహాయంతో గాలించగా పద్మారావు మృతదేహం లభించింది.



పద్మారావు

చికిత్స పొందుతూ ఒకరి మృతి

భిక్కనూరు, న్యూస్‌టుడే: మనస్తాపంతో పురుగు మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన ఘటన భిక్కనూరులో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై సాయికుమార్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కోరే బీరయ్య(50) గత నెల 25న మద్యం తాగాడు. అనంతరం మనస్తాపంతో పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించి ఇంటికి తెచ్చారు. శుక్రవారం కడుపులో మంటగా ఉందని చెప్పడంతో మళ్లీ కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. భార్య గంగామణి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

పిట్లం, న్యూస్‌టుడే: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన సంఘటన శనివారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పిట్లంకు చెందిన బాల్‌రాజ్‌గౌడ్ ఈ నెల 3న ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లారు. శనివారం ఇరుగుపొరుగు వారు గమనించగా ఇంటి తాళం పగలగొట్టి ఉంది. వెంటనే బాల్‌రాజ్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన వచ్చి చూడగా బీరువాలో ఉంచిన ఏడున్నర గ్రాముల బంగారం, నాలుగు జతల పట్టెగొలుసులు గుర్తు తెలియని దుండగులు అపహరించినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.



బిచ్కుంద: స్వాధీనం చేసుకున్న అధికారులు

రేషన్ బియ్యం పట్టివేత

బిచ్కుంద, న్యూస్‌టుడే: బిచ్కుంద బస్టాండ్‌లోని దుకాణంలో ఉన్న రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. శనివారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మహ్మద్ ఖలీల్ తనిఖీలు నిర్వహించగా 13.60 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. దుకాణ యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వెంట బిచ్కుంద ఆర్ఐ రవీందర్ ఉన్నారు.


మాచారెడ్డి, న్యూస్‌టుడే: అక్రమంగా రాయితీ బియ్యం తరలిస్తున్న ఒకరిని చుక్కాపూర్‌లో పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి రెండు క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్ చెప్పారు.

సమావేశంలో.. దొంగల చేతివాటం

భిక్కనూరు, న్యూస్‌టుడే: భిక్కనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. ముగ్గురి వద్ద నుంచి డబ్బులు, ఒకరి సెల్‌ఫోన్‌ను దొంగిలించారు. బాధితుల వివరాల ప్రకారం.. శనివారం మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎంపీ సురేశ్‌కుమార్ షెట్కార్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. భిక్కనూరు, దోమకొండ, రాజంపేట, బీబీపేట మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. మధ్యాహ్నం షబ్బీర్‌అలీ, సురేష్‌కుమార్ షెట్కార్‌లు మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలోకి చేరుకోగానే నాయకులంతా వారిని కలవడానికి ఉత్సాహం చూపించారు. ఈ సమయంలోనే అదును చూసిన దొంగలు ఓ మండల స్థాయి మాజీ ప్రజాప్రతినిధి జేబులో నుంచి రూ..10 వేల నగదు, మరో ఇద్దరి వద్ద రూ..6,000తోపాటు సెల్‌ఫోన్ దొంగిలించారు. బాధితులు భిక్కనూరు పోలీసులకు సమాచారం అందించారు.

అక్రమ వడ్డీ వ్యాపారం చేస్తే క్రిమినల్ కేసులు

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే : అప్పులు ఇచ్చి అధిక వడ్డీలు వసూలు చేసినట్లయితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎల్లారెడ్డి ఎస్సై మహేశ్ హెచ్చరించారు. రిజర్వు బ్యాంకు నిబంధనలకు వ్యతిరేకంగా ఎల్లారెడ్డిలో కొందరు వ్యాపారులు అప్పు ఇచ్చి అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే సమాచారం మేరకు శనివారం పలువురు ఇళ్లపై దాడులు నిర్వహించారు. ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించలేవన్నారు. ఈ దాడుల్లో ఏఎస్సై విజయ, సిబ్బంది పాల్గొన్నారు.



ఎల్లారెడ్డి : సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు